ప్రజాశక్తి

గురువారం 10 ఏప్రిల్ 2025

5

విజయనగరం



గ్రంథాలయసంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇకనుంచి జెసి ఆధ్వర్యంలో, ఆయన ఆదేశాలకు అనుగుణంగా గ్రంథాలయ సంస్థ కార్యకలాపాలు జరగనున్నాయి.



పింఛన్లపై వాగ్యుద్ధం

- వెరిఫికేషన్ల పేరిట తొలగిస్తారేమో? : జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- 10లక్షల పింఛన్లను తొలగించింది వైసిపి ప్రభుత్వమే : మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఉపాధి బకాయిలపై నీళ్లు నమిలిన అధికార, ప్రతిపక్షాలు
- బిసి కార్పొరేషన్ల రుణాలకు ఎమ్మెల్యే లెటర్లు ఎందుకన్న సభ్యులు
- తాగునీటి అవసరాలకు ఉమ్మడి జిల్లాకు రూ.2కోట్లు కేటాయింపు
- ఎంపి, బొబ్బిలి ఎమ్మెల్యే మినహా హాజరుకాని ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

పింఛన్ల మంజూరులో జాప్యంపై రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మధ్య వాగ్యుద్ధం చోటు చేసుకుంది. వాస్తవ పరిస్థితుల సంగతి కాస్త పక్కనబెడితే సుమారు 40నిమిషాలపాటు వీరి మధ్య వాగ్యుద్ధం కొనసాగింది. వైసిపికి చెందిన సభ్యులంతా చైర్మన్ మాటలకు మద్దతునివ్వగా, మంత్రి సమాధానం ఇస్తుండగానే సభ్యులు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదంటూ తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి అండగా నిలబడ్డారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా హామీలు నెరవేర్చలేదంటూ చైర్మన్ సహా వైసిపి సభ్యులంతా విమర్శించారు. ఐదేళ్లలో చేయలేని పనులు పది నెలల్లో చేసి చూపించామంటూ మంత్రి శ్రీనివాస్ సమాధానం చెప్పారు. చివరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జోక్యంతో వివాదం సద్దుమణిగింది. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్‌డిఎపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో జిల్లాలో పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో చేస్తున్న హడావుడి వల్ల చాలా మంది లబ్ధిదారులు తమకు పింఛన్లు పోతాయేమోనన్న ఆందోళనతో ఉన్నారని అన్నారు. తీవ్ర అనారోగ్యంతో మంచాలకు పరిమితమైన రోగులు, వికలాంగులు ఆసుపత్రులకు, కార్యాలయాలకు రాలేని పరిస్థితి ఉందని, ఇళ్ల వద్దే వెరిఫికేషన్ చేసేవిధంగా ప్రభుత్వం ఏమైనా చర్యలు తీసుకుంటుందా? లేదా అన్నది సమాధానం చెప్పాలని జెడ్‌పి చైర్మన్ ప్రశ్నించారు. వింతంతువులకు గత ప్రభుత్వ హయాంలో వెంట వెంటనే పింఛన్లు మంజూరు చేసేవారని, ప్రస్తుతం ఇలా ఇవ్వడం లేదని పలువురు సభ్యులు విమర్శించారు. దీంతో, గత ప్రభుత్వమే రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల పింఛన్లను తొలగించిందని, తాము అర్హులందరికీ ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామని అన్నారు. దీంతో, సమావేశంలో వైసిపికి చెందిన మెజార్టీ సభ్యులు మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ, ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్క హామీ కూడా నెరవేరలేదంటూ బిగ్గరగా మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని, హామీలు కూడా ఒకొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. మంచం పట్టిన వారికీ, వికలాంగులకు పారదర్శకంగా వెరిఫై చేసి నిజమైన అర్హులకు అందజేయాలనే వెరిఫికేషన్ చేస్తున్నామన్నారు. మంచం పట్టిన వారి కోసం వైద్య బందం వారి ఇంటికే వెళ్లి వెరిఫై చేస్తున్నారని తెలిపారు. జీవిత భాగస్వామి మరణిస్తే వారి స్పౌజ్‌కు పింఛను నవంబర్ నుండి అందిస్తున్నామని తెలిపారు. నవంబర్ కన్నా ముందు చనిపోయిన వారికి కూడా పింఛను అందజేయడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

దీనికి ముందు తాగునీటిపై జరిగిన చర్చల్లో చైర్మన్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జెడ్‌పి నుంచి పార్వతీపురం, విజయనగరం జిల్లా కలెక్టర్లకు రూ.కోటి చొప్పున మొత్తం రూ.2కోట్లు కేటాయిస్తామన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ తాగు నీటి సరఫరా కోసం మెటీరియల్ అవసరమైతే ఎంపి నిధుల నుండి సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు (బేబీ నాయన) మాట్లాడుతూ బొబ్బిలి మున్సిపాలిటీకి తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ తాగునీరు, సాగునీరు సరఫరా చేయడానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ వేతన దారులకు వేతన బకాయిలు చెల్లించాలని సభ్యులు కోరిన మేరకు మంత్రి స్పందిస్తూ జనవరి 14 వరకు వేతనాలను చెల్లించడం జరిగిందని, ఈనెల 13, 14 తేదీలలో మిగిలిన బకాయిలు కూడా చెల్లిస్తామని తెలిపారు. సాక్షాత్తు జెడ్పీ చైర్మనే బకాయిల సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదు, కేంద్ర ప్రభుత్వం వద్ద ఆ సమస్య ఉందంటూ సర్ధిచెప్పడంతో వైసిపి సభ్యులంతా మిన్నకుండిపోయారు. ఉపాధి పనులు పంచాయతీ తీర్మానాలతో జరగడం లేదని , పనుల నాణ్యత తక్కువగా ఉందని పలువురు సభ్యులు ప్రస్తావించగా జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందిస్తూ గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులనే చేపడుతున్నామని, నాణ్యత విషయంలో ఎక్కడైనా జరిగితే స్వయంగా తనిఖీ చేస్తానని కలెక్టర్ తెలిపారు. మండలానికి 40చొప్పున మాత్రమే బిసి కార్పొరేషన్ రుణాలు మంజూరయ్యాయని, దరఖాస్తులు వేలల్లో రావడం వల్ల అందరికీ న్యాయం చేయలేని పరిస్థితి ఉందని చెప్పారు. కార్పొరేషన్ రుణాల కోసం ఇప్పటి నుంచే ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు జారీ చేస్తున్నారని, ఆ లేఖలు ఉంటే తప్ప అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదంటూ దరఖాస్తుదారులు చెబుతున్నారని పలువురు సభ్యులు విమర్శించారు. అటువంటి పరిస్థితి లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో మన్యం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్సీలు పివివి సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు), ఇందుకూరి రఘురాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు



పింఛన్ల కోసం దరఖాస్తు చేస్తున్న మహిళలు (ఫైల్)

వితంతువులపై వివక్ష

- ఏడాదిగా పింఛన్ల కోసం ఎదురుచూపులు
- పెండింగ్‌లో 290 దరఖాస్తులు

ప్రజాశక్తి – గుర్ల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పింఛను మొత్తాన్ని పెంచిన విషయం తెలిసిందే. అయితే కొత్త పింఛన్లకు అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా వితంతువులకు ఏడాదిగా పింఛన్లు మంజూరు కావడం లేదు. దీంతో మండలంలో 290 మంది వితంతువులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

గుర్ల మండలంలో వితంతువులకు గడిచిన సంవత్సర కాలం నుంచి పింఛను మంజూరు కాకపోవడంతో అర్హులైన వారంతా పింఛను కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం మూడు వేల రూపాయల వరకు సామాజిక పింఛన్లు పెంచి, తరువాత పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి సైట్ ఓపెన్ కాకుండా బ్లాక్ చేసింది. ఇంతలో సాధారణ ఎన్నికలు రావడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అర్హులైన వారంతా ఎన్నికల తరువాత వచ్చిన ప్రభుత్వం తమకు పింఛన్లు మంజూరు చేస్తుందని ఆశించారు. ఎన్నికలలో టిడిపి మేనిఫెస్టోలో వృద్ధాప్య, వితంతు పింఛన్లను 4 వేల రూపాయలు పెంచుతామని ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాట ప్రకారం పింఛను పెంచినప్పటికీ, అర్హులైన వితంతువులకు నేటికి పింఛను మంజూరు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంవత్సర కాలం నుంచి పింఛను రాకపోవడంతో అర్హులైన వారంతా నిరాశతో వున్నారు. ఇదిలా వుంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత.. భర్త పింఛను తీసికొని ఉండి ఆయన మరణిస్తే భార్యకు భాగస్వామ్య కోటలో పింఛనుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని గత నవంబర్ నుంచి ప్రభుత్వం కల్పించింది. అటువంటి వారికి పింఛను అందుతోంది. కానీ నవంబర్ కంటే ముందు భర్త చనిపోయిన భార్యకు మాత్రం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించలేదు. దీంతో అర్హులైన పలువురు వితంతువులకు పింఛను అందకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అర్హులైన వితంతువులందరికీ పింఛను వచ్చేలా చూడాలని కోరుతున్నారు. మండలంలో గడిచిన సంవత్సర కాలం నుంచి 290 మంది వితంతువులు ఉన్నారిన వీరంతా పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారని ఇఒపిఆర్‌డి అన్నపూర్ణ దేవి తెలిపారు. ఇటీవల ఫౌజ్ కోటా కింద 36 పింఛను ఆన్‌లైన్ చేశామని చెప్పారు.

ప్రతి నియోజకవర్గానికీ విజన్ ప్లాన్

కలెక్టర్లు బిఆర్ అంబేద్కర్, శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం

భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతీ నియోజకవర్గానికి విజన్ ప్లాన్ రూపొందించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. స్వర్ణాంధ్ర-2047 కెపాసిటీ బిల్డింగ్ పై విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రారంభమయ్యింది. హాజరైన కలెక్టర్లు అంబేద్కర్, శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు సంబంధించి డ్రాఫ్ట్ ప్లాన్‌ను రూపొందించామని, నియోజకవర్గాలకు కూడా ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎమ్మెల్యేల సలహాలను పరిగణనలోకి తీసుకొని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాల భౌగోళిక పరిస్థితిని బట్టి వ్యవసాయ, అనుబంధ రంగాల్లోనే ప్రగతికి ఎక్కువగా అవకాశం ఉంటుందని అన్నారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే పారిశ్రామిక, సేవా రంగాలు కూడా అభివద్ధి చెందుతాయని చెప్పారు. జిల్లాలో పర్యాటక రంగ అభివద్ధికి ఎంతో అవకాశం ఉందని అన్నారు. విజన్ 2047 డాక్యుమెంట్ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, అన్ని నియోజకవర్గాలకు ఒకే ప్రణాళిక పనిచేయదని, అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రాథమిక రంగంలో ఉద్యాన పంటలు సాగును విస్తరించడం, పశు సంపదను వృద్ధి చేయడం తదితర చర్యలను సూచించారు. పండ్లు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ సమగ్రంగా అధ్యయనం చేసి, నిర్ణీత గడువులోగా నియోజకవర్గాలకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ముఖ్య ఆర్థిక సూచికల ద్వారా, డేటాను సమీకరించడం, దానిని విశ్లేషించడం, ప్రణాళికలను రూపొందించడంపై శిక్షణ ఇచ్చారు. వర్క్‌షాప్‌లో ప్రణాళికాశాఖ విశ్రాంత డైరెక్టర్, సలహాదారు సీతాపతిరావు, మూడు జిల్లాల సిపిఒలు పి.బాలాజీ, వీర్రాజు, లక్ష్మీప్రసన్న, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, పర్యవేక్షణా బృందం సభ్యులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్లు అంబేద్కర్, శ్యామ్‌ప్రసాద్

యుపి పాఠశాలలను కొనసాగించండి

ఎమ్మెల్యేకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-రాజాం

రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించి ప్రభుత్వ బడులను రక్షించాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రుమురళీమోహన్‌కు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు బుధవారం వినతి పత్రి అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 117, 128 వల్ల కుదేలైన ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడడానికి, పునర్నిర్మాణం చేయడానికి ఈ ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117, 128 జీవో నెంబర్లను ఈ ప్రభుత్వం రద్దు చేసిందని, గ్రామపంచాయతీలో 60 పైబడి విద్యార్థులు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీగా ఏర్పాటు చేసి ఐదు తరగతులకు ఐదుగురు టీచర్లను కేటాయిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. కొన్ని సందర్భాలలో తల్లిదండ్రుల కోరితే 45 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారని, కానీ అమలు చేయడంలో భిన్నమైన పద్ధతులను అవలంభించి సమీప గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడంతో పాటు కనీసం అవసరమున్న చోట పాథమిక పాఠశాలలను కొనసాగించకుండా విలీనం చేయడం వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. 60మంది పైబడి విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను దూరంతో సంబంధం లేకుండా ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని. 60 కంటే తక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలలో యథాతదంగా కొనసాగించాలని లేనిపక్షంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ అంశాలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వినతినిచ్చిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పక్కి వాసు, డివిజన్ కార్యదర్శి గిరడ చంద్రశేఖర్ నాయుడు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎ.వెంకటప్పలనాయుడు, రేగిడి, రాజాం మండల ప్రధానకార్యదర్శులు వి సత్యనాయుడు, బి.నాగేశ్వరరావు, రాజాం వంగర మండల అధ్యక్షులు మువ్వల రమేష్, మర్రాపు ప్రసాద్ ,సీనియర్ నాయకులు పల్ల మురళి, రౌతు దాలినాయుడు, పాతిన కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మా భూములకు రహదారి సౌకర్యం కల్పించండి

కేంద్రమంత్రికి రైతుల వినతి

ప్రజాశక్తి – భోగాపురం

జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో తమ పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడుకు రైతులు వినతి పత్రం అందజేశారు. విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలించేందుకు మంగళవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా హైవే పైన ఉప్పాడపేట జంక్షన్ వద్ద రైతులు ఆయనను కలిసారు. విమానాయానికి వెళ్లేందుకు నిర్మించే అప్రోచ్ రోడ్డుకు విలువైన భూములను ఇచ్చామని తెలిపారు. కానీ అదే రహదారిలో తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా జిఎంఆర్ సంస్థ ఏకంగా ఇనుపకంచె వేస్తోందని తెలిపారు. దీంతో తమ భూముల్లోకి వ్యవసాయం చేసుకోవడానికి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. అప్రోచ్ రోడ్డుకు భూములు తీసుకుని ఇప్పటివరకు పరిహారం వేయడం లేదని మరి కొంతమంది రైతులు ఫిర్యాదు చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి ఈ సమస్యలపై మాట్లాడారు. రైతులు తమ దృష్టికి కొన్ని సమస్యలు తీసుకువచ్చారని, ముఖ్యంగా అప్రోచ్ రోడ్ సమస్యను కూడా వివరించారని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి సాధ్యాసాధ్యాలను పరిశీలించి రైతుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని అన్నారు.

పోలీసుశాఖలో కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా పోలీసుశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం, పోలీసు స్టేషన్లలో పనిచేస్తూ ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన నలుగురు పోలీసుల కుటుంబాలకు కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను ఎస్‌పి వకుల్ జిందాల్ బుధవారం అందజేశారు. విధి నిర్వహణలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, వారి కుటుంబంలోని వ్యక్తులకు కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశామన్నారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన బి.తరుణ్ కుమార్, కె.కోమలత, బి.స్వామినాథ్, సిహెచ్.సాయి రెడ్డిలను ఎస్‌పి అభినందించారు. పోలీసుశాఖలో నీతి నిజాయితీ, క్రమశిక్షణతో పని చేయాల సూచించారు. అదనపు ఎస్‌పి (అడ్మిన్) పి.సౌమ్యలత, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి జూనియర్ సహాయకులు చాముండేశ్వరి పాల్గొన్నారు.

డబుల్ కాలనీలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పరిధిలోని డబుల్ టిన్ కాలనీలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి దానికి ఏర్పాటు చేసిన హద్దులను, స్తంభాలను కమిషనర్ ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది తొలగించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఆక్రమాలకు గురైన ప్రాంతాన్ని కమిషనర్ పల్లి నల్లనయ్య గమనించారు. తక్షణమే ఆక్రమిత స్థలానికి ఏర్పాటు చేసిన స్తంభాలు ఇనుప తీగలను తొలగించి వేయాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి హద్దులను ఏర్పాటు చేయడం క్షమించరానిదని కమిషనర్ అన్నారు.

గ్రామ, వార్డు వాలంటీర్ వ్యవస్థ వంచన దినం

కరపత్రాలను ఆవిష్కరించిన వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏప్రిల్9 వార్డు, గ్రామ వాలంటరీ వ్యవస్థ వంచన దినంగా వైసిపి ప్రకటించింది. ఈనేపథ్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం జెడ్‌పి చైర్మన్,వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 9 ఏప్రిల్ 2024 ఉగాది, తెలుగుదేశం పార్టీ అధికార పత్రిక చైతన్య రథంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వాలంటీర్ల గౌరవ వేతనం 5 వేలు నుండి రూ.10వేలకు పెంచుతామని, వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ఆ హామీని అమలు చేయకుండా ఆ వ్యవస్థనే లేకుండా చేయడం దారుణమన్నారు. వైసిపి ప్రభుత్వం జీవో 4,14,156,201 ద్వారా వాలంటరీ వ్యవస్థకు చట్టబద్ధత చేపట్టిన తరుణంలో, తెలుగుదేశం, జనసేన, బిజెపి గత వైఎస్ఆర్ ప్రభుత్వం నవరత్నాలు సర్వే లను వాలంటీర్లు నిర్వహిస్తే ఆ సర్వే నివేదికలను ఎస్‌సి గణాంకాలుగా జీవో 91 ను ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొంగ భానుమూర్తి, దారాన వెంకటేష్, లోపింటి రామకృష్ణ, రేగాన శ్రీనివాసరావు, వేముల వంశి, ఈర్ల రవిరాజ్, సంతోష్ పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా రెవిన్యూ డివిజనల్ కార్యాలయ ఇన్‌ఛార్జి కె.హరికిరణ్‌కు విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి ఆధ్వర్యాన బుధవారం వినతి అందజేశారు. దశాబ్దాలుగా గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు సర్వీసు అందిస్తున్న తమ జీతభత్యాలు మాత్రం పెరగడం లేదని , ప్రస్తుత ధరల్లో రూ.10,500 జీతంతో ఎలా బతకాలని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్రంలో మాదిరి పే స్కేలు అమలు చేయాలని, రెగ్యులర్ చేయాలని కోరారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, విఆర్‌ఎల ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే దశలవారి ఆందోళన చేస్తామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు, విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, సీనియర్ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జెఎన్‌టియుజివి ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు ప్రిన్సిపాల్ కార్యాలయం ద్వారా పంపించే గూగుల్ ఫామ్ లింక్ ద్వారా ఈనెల 10లోగా పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

పోక్సో కేసులో నలుగురు అరెస్టు

మైనర్లను వేధిస్తే పోక్సో కేసులు తప్పవు : డిఎస్‌పి

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని బూరాడకు చెందిన మైనర్ బాలికను వేధించిన కేసులో గ్రామానికి చెందిన నలుగురిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు డిఎస్‌పి రాఘువులు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బూరాడకు చెందిన ఓ బాలిక తల్లిదండ్రులు మార్చి 28న తమ కుమార్తె కనిపించడం లేదని రేగిడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ బాలికను విజయవాడ రాణి గారి కోటకు తీసుకు వెళ్లేందుకు చిన్న శిర్లాంకు చెందిన గొట్టాపు దుర్గాప్రసాద్, మునకాలవలసకు చెందిన కరణం జగదీష్ బాలికను మాయ మాటలతో మోసగించి ఆమె మెడలో బంగారం చైను తీసుకొని తనఖా పెట్టి అమ్మాయిని రాజాం నుంచి చీపురుపల్లి వెళ్లి రైల్వేస్టేషన్‌లో విజయవాడ వెళ్లే రైలు ఎక్కించారు. విజయవాడకు చెందిన ఎడ్లగీత, దేవరకొండ బాలు విజయవాడలో బాలికను కలసి దేవరకొండ బాలుతో కలిసి వీరిద్దరికీ వసతిని ఏర్పాటు చేశారు. అక్కడ పోలీసులు పోలీసు బాలిక ఆచూకీ తెలుసుకొని స్వగ్రామానికి వారు బస్సు ఎక్కించడంతో ఇంటికి చేరింది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలికను ప్రోత్సహించిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ చిన్నపిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, లైంగిక చర్యలకు పాల్పడినా పోస్సో కేసులు తప్పవని అన్నారు. సమావేశంలో సిఐ ఉపేంద్రరావు, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి రాఘువులు

నిర్మాణాలు త్వరితగతిన పూర్తి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో డిఇలతో సమావేశమయ్యారు. ముఖ్యంగా నగరంలో మరమ్మతులకు గురైన ఫౌంటెన్‌లను యుద్ధ ప్రాతిపదికన సరి చేయాలన్నారు. ఫౌంటెన్ల నిర్వహణలో తలెత్తిన సాంకేతికపరమైన సమస్యలను సరిదిద్దాలన్నారు. ఎప్పటికప్పుడు వీధి దీపాల నిర్వహణపై నివేదికలు సమర్పించాలన్నారు. మరమ్మతులకు గురైన లైట్లను తక్షణమే తొలగించి నూతన లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. వాటర్ ట్యాంకులు తరచూ పరిశుభ్రపరిచే విధంగా సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. సమావేశంలో డిఇలు ప్రసాదు, శ్రీనివాసరావు, మణికుమార్ పాల్గొన్నారు.

పౌర సరఫరాల గిడ్డంగి తనిఖీ

ప్రజాశక్తి - భోగాపురం


రికార్డులను పరిశీలిస్తున్న జెసి

భోగాపురంలోని పౌరసరఫరాల గిడ్డంగిని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ బుధవారం పరిశీలించారు. గిడ్డంగిలో ఉన్న బియ్యం, పంచదార తదితర వస్తువులను తనిఖీ చేశారు. అనంతరం రికార్డులో ఉన్న స్టాకును, గిడ్డంగిలో ఉన్న సరుకుల వ్యత్యాసాన్ని కూడా తనిఖీ చేశారు. సరుకుల నాణ్యతను సైతం పరిశీలించారు. పౌరసరఫరాల డిఎం మీనాకుమారి, ఉప తహశీల్దార్ సుభాష్, సిఎస్‌డిటి మురళీకృష్ణ, గోడౌన్ ఇంచార్జ్ స్వర్ణలత, ఆర్ఐ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - భోగాపురం

జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి వి.ఆదినారాయణ ఆదర్శ పాఠశాలను బుధవారం సందర్శించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర స్టూడెంట్ కిట్స్ ఏ విధంగా భద్ర పరుస్తున్నారని విద్యాశాఖాధికారి ఎం.రమణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 15 నుండి స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌కి పంపుతామని తెలిపారు. ఈ కిట్స్ పాఠశాలలకు చేరేంతవరకు మండలానికి సంబంధించిన మానిటరింగ్ టీం సభ్యులు, కో-ఆర్డినేట్ స్టాఫ్ సభ్యులు బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరానికి కూడా 1 వ తరగతి నుండి 12 వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఈ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్స్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సి.పార్వతి, కో-ఆర్డినేటర్ డి.సూర్య నారాయణ, సిఆర్‌పిలు ముద్దన విజయ భాస్కరరావు, మాత శేషు బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రాజాం

సమస్యలపై అధికారులు దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. బుధవారం డోలాపేట టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలపై అధికారులు దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. అనంతరం కార్యకర్తే అధినేత కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తల కుటుంబానికి అండగా ఉంటామని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచింది కార్యకర్తలేనని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇందులో బాగానే ప్రతి బుధవారం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను సరి చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలోని రాజమహల్ కాలనీలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వైర్లు చేతులకు తగిలేలా వేలాడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖాధికారులు స్పందించి వైర్లను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు రవికుమార్ డిమాండ్ చేశారు.

సంకల్ప రథంతో అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ మోడల్ స్కూల్ విద్యార్థులకు సంకల్పం రథంతో పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి. గణేష్ గంజాయి వల్ల కలిగే దుష్ప్రయోజనాలు, గంజాయి నిర్మూలనకు చేపట్టవలసిన చర్యలు, నేటి యువతపై గంజాయి డ్రగ్స్ ప్రభావం, డ్రగ్స్ కుటుంబాలును ఏ విధంగా విచ్ఛిన్నం చేస్తాయి, సైబర్ నేరాలు హనీ ట్రాప్, ట్రాఫిక్ చట్టం తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13న గురుకుల కళాశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రవేశానికి ఈ నెల 13న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 13న 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ పరీక్ష ఒఎంఆర్ షీట్ విధానంలో ఉంటుందని, ఒఎంఆర్ షీట్ బబుల్ చేయడానికి కేవలం బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్స్ మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్స్ http:apbragcet.apcfss.in వెబ్ సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, విద్యార్థి ఆధార్ కార్డుతో పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందు హాజరు కావాలని సూచించారు.

పన్నులు చెల్లిస్తే రాయితీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో 5శాతం రాయితీతో పన్ను చెల్లించాలని కమిషనర్ కిల్లాన అప్పలరాజు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ వాసులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్థి, ఖాళీ స్థలం పన్నులు ఈ ఏప్రిల్ 30వ తేదీలోగా పన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ ప్రకటించిందని తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో ఇళ్ల యజమానులు, వ్యాపార సంస్థ, కళాశాల, ఆసుపత్రుల యజమానులు రాయితీ అవకాశాన్ని వినియోగించుకొని పన్నులు చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాగా Cdma.ap.gov.in వెబ్‌సైట్, పురమిత్ర యాప్, మన మిత్ర కార్యక్రమం కింద 9552300009 నంబరు ద్వారా, నగర పంచాయతీ కార్యాలయంలో సెలవు దినాల్లో కూడా నేరుగా చెల్లించవచ్చని కమిషనర్ అప్పలరాజు తెలిపారు.

ఇంటింటి కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడిలో ఇంటింటికి కుళాయిలను బుధవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ప్రారంభించారు. పంచాయతీ నిధులు 5 లక్షలతో రామాలయం వీధి, పెద్ద దొడ్డి వీధి, ఏడువాక వీధి, నెయ్యిల వీధి, తురక వీధిలలో ఏర్పాటు చేసిన ఇంటింటికి తాగునీటి కుళాయిలను ఆయన ప్రారంభించారు. కుళాయిలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రవికుమార్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి రాంబాబు, ఉప సర్పంచ్ రుద్ర వెంకటరమణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం

ప్రజాశక్తి- రాజాం

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్లుతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా ప్రగతి పై సమీక్ష జరిపి, వాటిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ మేరకు ప్రతిరోజు వేతన దారులు సమయపాలన పాటించాలని, కొలతలు, ప్రాప్తికి పని చేయాలని, రోజుకు 307 రూపాయలు గిట్టుబాటు ధర వచ్చే విధంగా పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ ఫీల్డ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అవనాపు సూరిబాబుకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


నివాళులర్పిస్తున్న అవనాపు విక్రమ్ తదితరులు

విజయనగరం మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ వ్యాపార వేత్త అవనాపు సూరిబాబు 13వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు, జనసేన నాయకులు అవనాపు విక్రమ్ నివాళ్లు అర్పించారు. బుధవారం బాలాజి నగర్ లోని జనసేన కార్యాలయంలో సూరిబాబు చిత్రపటానికి విక్రమ్, అతని కుటుంబ సభ్యులు పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి, వ్యాపార వేత్తగా, రాజకీయ నేతగా ఎదిగిన తన తండ్రి సూరిబాబు తన చుట్టూ ఉన్న అనేక మందికి అండగా నిలిచారని, గుప్త దాతగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కాళ్ళ గౌరీశంకర్, పట్టణ, మండల జనసేన నాయకులు, కార్యకర్తలు, అవనాపు సూరిబాబు అభిమానులు, అవనాపు విక్రమ్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

పోషణ పక్షోత్సవాలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- డెంకాడ

పోషణ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని సిడిపిఒ ఎ.సత్యవతి కోరారు. మండల కేంద్రంలో పక్షోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సూపర్‌వైజర్లతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భోగాపురం సిడిపిఒ సత్యవతి మాట్లాడుతూ ఈ నెల 22 వరకు పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి అంగన్వాడీ కార్యకర్త తమ సెంటర్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రంలో పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారుల తమంతట తామే నమోదు చేసుకోవాలన్నారు. బరువు తక్కువ పిల్లల గురించి వారి సంరక్షణ చర్యల గురించి తల్లులకు వివరించారు. పిల్లలు ఆరోగ్యకరమైన జీవనశైలి ఆహారపు పద్ధతులను ఆహారపు అలవాట్లను తెలుసుకునేలా అవగాహన కల్పించాలని అంగనవాడీ కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎ.సత్యవతి, పి.శైలజరాణి, అంగనవాడి కార్యకర్తలు, ఆయాలు, ట్రైనింగ్ నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ: అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సత్యవతి

శృంగవరపుకోట: పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు కౌమార బాలికలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని అంగన్వాడి సూపర్‌వైజర్ సుశీల అన్నారు. బుధవారం మండలంలోని వెంకటరమణపేట గ్రామంలో గల నాలుగు అంగన్వాడీల పరిధిలో ఈ నెల 22వ తేదీ వరకు జరుగు పోషణ పక్వాడ, పోషణ అభియాన్ పక్షోత్సవాలలో భాగంగా గర్భిణులు, బాలింతలకు, కౌమార బాలికలకు వెయ్యి రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సెంటర్లలో ఏ రోజు ఏ కార్యక్రమం నిర్వహించాలో తెలియపరిచే పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ కె.వసంత, అంగన్వాడీ టీచర్ క్రాంతి, ఎఎన్ఎంలు, నాలుగు సెంటర్ల టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రామభద్రపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి తెలిపారు. ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం జన్నివలస అంగన్వాడీ సెంటర్లో తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మెరుగైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని సూచించారు. తల్లులకు వెయ్యి రోజుల సంరక్షణ గురించి వివరించారు. తల్లిపాల విశిష్టత, కాంప్లిమెంటరీ ఫీడింగ్, చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. రొంపల్లి గ్రామంలో ఈ పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల చలివేంద్రానికి జర్నలిస్టుల చేయూత

బొబ్బిలి: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు పోలీస్ స్టేషన్ వద్ద పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలి వేంద్రానికి పెరుగు ఇచ్చి విలేకరులు అండగా నిలిచారు. మజ్జిగ చలి వేంద్రానికి మూడు రోజులకు సరిపడా పెరుగు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు అందించారు. విలేకరులకు సిఐ సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రిజర్వేషన్ అమలు చేయాలి

ప్రజాశక్తి - భోగాపురం

అధిక శాతం ఉన్న బిసిలకు జనాభా నిష్పత్తిని బట్టి 52 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు ఎరుకొండ వెంకటరావు అన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు బందెల గౌతం కుమార్ అదేశాల మేరకు ఈనెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చందల చిన్న పాల్గొన్నారు.

త్వరలో ఇమ్యూనోథెరపీ డ్రగ్స్

●రోగ నిరోధక శక్తి పెంపుదలతో వ్యాధులు దూరం ●వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ వి. నాగేశ్వర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్

శరీరం ఏ వ్యాధికి గురైన దానిని అదుపు చేయడానికి అవకాశం ఉంటుందని, త్వరలో ఇంజెక్షన్లకు బదులుగా ఇమ్యూనో థెరపి డ్రగ్స్ ఇచ్చే అవకాశాలున్నాయని వరల్డ్ అలెర్జీ అధ్యక్షులు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ అన్నారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మెడికల్ స్కిల్స్ పై నిర్వహించిన వర్క్‌షాపును వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ మాట్లాడుతూ రానున్న కాలంలో వివిధ రకాల వ్యాధులకు మాత్రలు, ఇంజెక్షన్లు బదులుగా ఇమ్యూనో థెరపీ డ్రగ్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇతర దేశాలలో ఆ విధానం కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగా అనేక వ్యాధులను నియంత్రించాలంటే ఇమ్యూనో థెరపీ డ్రగ్స్ చికిత్స కీలక పాత్ర పోషించనుందన్నారు. వ్యాధుల నియంత్రణకు యాంటిజెన్, యాంటిబాడీల ప్రతి చర్యలపై ఆధారపడి ఉంటుందన్నారు. అందువల్లనే కోవిడ్ సమయంలో యాంటిబాడీ కణాలు ఎక్కువగా చనిపోవడం వల్ల రోగ నిరోధకశక్తి తగ్గి ఎక్కువ మంది చనిపోయారన్నారు. అప్పటి నుంచి ఇమ్యూనాలజీకి ప్రాధాన్యత పెరిగిందన్నారు. దేశంలో వివిధ రకాల అలెర్జీలతో బాధపడుతున్న వారి సంఖ్య 35 శాతం ఉందన్నారు. కాగా, వాటికి చికిత్సనందించే వైద్యులు మాత్రం దేశ వ్యాప్తంగా కేవలం 800 మంది మాత్రమే ఉన్నారని వివరించారు. త్వరలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం, వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ సంయుక్తంగా మెడికల్ స్పెషలిస్ట్ అసిస్టెంట్ ప్రోగ్రామ్ అనే కొత్త కోర్సును నిర్వహించనున్నట్టు తెలిపారు. వీటిలో ఉద్యోగావకాశాలు అత్యధికంగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శాంతమ్మ, రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, డాక్టర్ చైతన్య, ఫోరెన్సిక్, అనస్థీషియా విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి- రాజాం


గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు, కార్మికులు

మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ నెల 10న విజయవాడ అలంకార సెంటర్ నుంచి మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ వద్దకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సామూహిక రాయబారం నిర్వహిస్తున్నామని రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ. జగన్మోహనరావు తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ వీధిలో సంబంధిత గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని మున్సిపల్ కార్మికులంతా ఆశించారని, అందుకు భిన్నంగా ఆప్కాస్‌ను రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం అంటే కార్మికులను పెనంలో నుంచి నిప్పుల్లోకి నెట్టేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకనే మొత్తం కార్మికుల దగ్గర సంతకాల సేకరణ చేసి విజయవాడలో అలంకార్ ధర్నా చౌక్ నుంచి మంత్రి ఇంటికి సామూహిక రాయబారం నిర్వహిస్తున్నామని తెలిపారు. రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్ అయిన, మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని, పట్టణ విస్తరణకనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పని భారం తగ్గించాలని, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పచెప్పకుండా కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ సామూహిక రాయబారం జరుగుతుందన్నారు. కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గోడ పత్రిక ఆవిష్కరణలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.త్రినాథ్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాజాం మున్సిపల్ యూనియన్ నాయకులు రవి, రాజేషు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - రామభద్రపురం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం సామాన్యులపై మరో భారం మోపి గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి సిలిండర్‌పై 50 రూపాయలు పెంచడాన్ని నిరసిస్తూ సిఐటియూ ఆధ్వర్యంలో బుదవారం గొల్లపేటలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో నిత్యవసర వస్తువైన గ్యాస్ ధర పెంచడం తుగ్లక్ పాలనా విధానాన్ని తలపిస్తోందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలు పెరగడం వల్ల ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆదాయాలు రోజురోజుకీ దిగజారిపోతున్నాయని కార్మికుల వేతనాలు పెరగడం లేదని కూలి దొరక్క ప్రజలు పూటగడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్లకు వేల, లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ సామాన్యులపై ఇలా ధరలు మోపడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు ఈశ్వరరావు, లక్ష్మీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.30 సాయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని ఎరుకొండలో నిర్మాణంలో ఉన్న సాయిబాబా ఆలయానికి కొవ్వాడ అగ్రహారం సర్పంచ్, జనసేన నేత కోట్ల రఘు బుధవారం రూ.30 వేలు ఆర్థిక సాయం అందించి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆర్థిక సాయం నగదు రూపంలో ఎరుకొండ సర్పంచ్ గొట్టపు అప్పలస్వామితో పాటు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఎరుకొండ సర్పంచ్ అప్పలస్వామి మాట్లాడుతూ తమ గ్రామంలో నిర్మాణమవుతున్న సాయిబాబా ఆలయానికి ఆర్థిక సాయం చేసినందుకు కొవ్వాడ సర్పంచ్ రఘుకు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా దాత కోట్ల రఘు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సాయం అందిస్తున్నామన్నారు. మానవ సేవతో పాటు మాధవ సేవ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొర్ల శ్రీను, ఆల్తి తవుడు, తాడివాడ రామారావు, వెంపటాపు శ్రీనివాస్, తాడివాడ అప్పలనాయుడు, వాళ్లే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని విధుల నుంచి తప్పించాలి

వేపాడ: వల్లంపూడి ఎస్ఐ బి.దేవిని విధుల నుంచి తప్పించాలని, ఉద్యోగం నుంచి తొలగించాలని, గుడివాడ ఎస్సిలపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని వల్లంపూడి, వేపాడ వీధుల్లో దళిత నాయకులు బుధవారం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ జె.రాములమ్మకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకుడు గాలి ఈశ్వరరావు, కిరణ్, ఆతవ నాగరాజు, డప్పు రాజు, పలు గ్రామాల మహిళలు పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా డిఎస్‌పి, సిఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - కొత్తవలస

ఎపి గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక ఎంపిడిఒకు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సిఐటియు నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ 2005 నుంచి నేటి వరకు అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకి మధ్య వారదిగా ఉంటూ అనేక సేవలు అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. వీరి శ్రమను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కారు చౌకగా దోచుకుంటున్నాయన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మెండేస్ విధానాన్ని రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, అందరికీ ఎఫ్‌టిఇ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంఎంఎస్ యాప్ రద్దుచేయాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడిఒ రమణయ్యకు అందజేశారు. సమస్యలను15 రోజుల్లోగా పరిష్కరించకపోతే 16వ రోజు నుంచి సమ్మెబాట పడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు సిహెచ్ సీతారామస్వామి, డి.శ్రీను, ఎం.నూకరాజు, బి.కనకమహాలక్ష్మి, శేఖర్, నూకరాజు, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పంచాయతీలు ఎంపిక

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్. సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం మండల, గ్రామ స్థాయి అధికారులతో కన్వర్జేన్స్ మీటింగ్ నిర్వహించి ఆరు మోడల్ పంచాయతీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలో చిన్న గుడిపాల, వేపాడ, వల్లంపూడి, పాటూరు, ఓబులయ్యపాలెం, ముకుందపురం గ్రామాలను మోడల్ పంచాయతీలకు ఎంపిక చేశామన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని వారికి అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయకూడదన్నారు. గ్రామస్థాయిలో ఉన్న సచివాలయ, అంగన్వాడి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ వర్కర్, వెలుగు విఒఎ, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసుకుని చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి, ఆర్‌డబ్ల్యు ఎస్ ఎఇ, ఎపిఎం, ఎపిఒ, అంగన్వాడి సూపర్వైజర్, హాస్పిటల్ సిహెచ్ఒ, ఎంపిహెచ్ఒ, పాల్గొన్నారు.

ఎస్సి వర్గీకరణ రద్దు చేయాలి

ప్రజాశక్తి - గుర్ల

మాలలకు అన్ని రంగాల్లో నష్టం కలిగించే ఎస్‌సి వర్గీకరణను రద్దు చేయాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్సి వర్గీకరణ రద్దు చేయాలని, మాలలకు రిజర్వేషన్ల శాతం పెంచాలని, ఎట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ పేరుతో మాలలకు విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో శాతాన్ని కుదించి వారిని నష్టపరచాలని రాజకీయ పార్టీలు అన్ని ఏకమై వర్గీకరణ అంశాన్ని అమలు జరపాలని కుట్రపన్నాయన్నారు. రాష్ట్ర ఎస్‌సి జనాభాలో అత్యధికంగా ఉన్న మాలలకు దీని వల్ల తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వర్గీకరణ అంశాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం ఇంచార్జీ తహశీల్దార్ వి.నారాయణమ్మని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు మండల ఉపాధ్యక్షుడు చందక నూకరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు చోళ్ల రాజకుమారి, కార్యదర్శి కోరాడ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు పాండ్రంకి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భోగాపురం

అగ్ని ప్రమాద బాధితులకు జనసేన నాయకులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల చేపల కంచెరు గ్రామంలో కోలా ఎల్లయ్యకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. దీంతో ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాలతో మండల జనసేన నాయకులు 11 వేల రూపాయలు నగదుతో పాటు 5వేలు రూపాయలు విలువైన నిత్యాసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మట్ట అయ్యప్ప రెడ్డి, పడాల శ్రీనివాసరావు, వందనాల రమణ, మైలపల్లి నరసింహులు, అప్పలకొండ, బొల్లు త్రినాథ్, దల్లి శ్రీను, అరజల్ల నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు గ్రామసభలే ప్రధానం

శృంగవరపు కోట: దేశానికి పార్లమెంటు రాష్ట్రానికి అసెంబ్లీ వలె గ్రామ పంచాయతీకి రాజ్యాంగబద్ధ గ్రామసభలే ప్రధానమైనవని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వేదిక ప్రతినిధులు ఎంఎస్ఎన్ మూర్తి, ఎల్ సాంబమూర్తి, వి లోకేష్‌తో కలిసి స్టాట్యూటరీ గ్రామసభల నిర్వహణపై పత్రికా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి బడ్జెట్ ప్రణాళిక పేరుతో జరగనున్న గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.

16 మంది జూదగాళ్లు అరెస్టు

రూ.1.72లక్షల నగదు, 15 వాహనాలు, ఫోన్లు సీజ్

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని కాకర్లవలస శివారులో పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్సు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తెలిపారు. సంయుక్త దాడుల్లో వీరు పట్టుబడ్డారని, ఘటనా స్థలంలో రూ.1,72,900 నగదు, 15 సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు.

వ్యాపారిపై ఆగంతుకుల దాడి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కిల్తంపాలెం నవోదయ విద్యాలయ సమీపంలో బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై జీడీపిక్కలు కోనేందుకు వెళ్తున్న వృద్ధవ్యాపారిపై నలుగురు గుర్తుతెలియని ఆగంతులకు దాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై వ్యాపారి ముప్పన సత్యన్నారాయణ మాట్లాడుతూ తనది గంట్యాడ మండలం బోనంగి గ్రామమని ఉదయం గ్రామం నుంచి బొడ్డవర వైపు జీడీపిక్కలు కోనేందుకు తిరుగుతున్న సమయంలో నలుగురు వ్యక్తులు వచ్చి తన వాహనం ఆపారని, ఇదే సమయంలో తన దగ్గర వున్న డబ్బులు ఇవ్వమని చెప్పి తనను లాగడం మొదలు పెట్టారని చెప్పారు. అయితే డబ్బులు వున్న జేబును గట్టిగా పట్టుకొని పెద్దకేకలు వేయడంతో తనను వాహనం నుంచి కిందకు తోసేసి తన సెల్‌ఫోన్ లాక్కోని పరారయ్యారని తెలిపారు. గాయాలతో మండలంలోని ముషిడిపల్లి వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం వద్దకు చేరుకొని అక్కడ వున్న సచివాలయం ఉద్యోగులకు చెప్పడంతో వెంటనే వారు మహిళ పోలీసు ద్వారా ఎస్.కోట పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఈ మార్గంలో ఇవి నిత్యకృత్యంగా మారాయని ఒక్కరు రావడానికి భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతం రహదారి నిర్మానుష్యంగా వుండటంలో ఆగంతకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వీరిని గుర్తించి పట్టుకోవాలనీ స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సరగడ రామకాసు (34) అనే యువకుడు మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ సూర్యకుమారి అందించిన వివరాలు ప్రకారం.. గూడెపువలస గ్రామానికి చెందిన సరగడ రామకాసుతో పాటు మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై గతేడాది సెప్టెంబరు 9వ తేదీన బైక్ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో సరిగడ కాసుకు గాయాలు తగలగా మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న రామకాసు మంగళవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో, ట్రాక్టర్ ఢీ.. మహిళ మృతి

నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని గొల్లలపేట గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. గొల్లలపేట నుంచి కొట్టక్కి వెళుతున్న ఆటోను ఇసుక కోసం గొల్లలపేట వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గొల్లలపేట గ్రామానికి చెందిన బాలి ఆదిలక్ష్మి (37) అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ఉన్న బాలి పద్మావతి, బాలి రవణమ్మ, లెంక సత్యవతి, బాలి వాసులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని బొబ్బిలి ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలు ఆదిలక్ష్మీకి లలిత,హేమ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త రామకృష్ణ, వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

గంజాయి రవాణా జామి మండలం గుండా జరుగుతుందన్న సమాచారంతో మండలంలోని అలమండ రైల్వే స్టేషన్ వద్ద అక్రమంగా ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న గంజాయిని ఎస్ఐ వీర జనార్ధన్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. దీనికి సంబంధించి వివరాలను సిఐ అప్పలనాయుడు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన ఇద్దరు యువకులు ఒక మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై విజయనగరం గంజాయి తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో పోలీసులు అలమండ రైల్వే స్టేషన్ వద్ద కాపు కాసి గంజాయితో పాటు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరి వద్ద ఉన్న మూడు కేజీల గంజాయి సెల్ ఫోన్‌లు వీరు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జామి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి విజయనగరం రైల్వే స్టేషన్‌కు విక్రయించేందుకు పట్టుకెళుతున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి రవాణా అడ్డుకున్న ఎస్ఐ వీర జనార్ధన్ సిబ్బందిని సిఐ అభినందించారు.